


## ఘనంగా బి కే బి పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**విశ్వంభర, మలక్ పేట్ :** బికేబి పాఠశాల మలక్పేట తెలుగు మీడియం 1989 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1989 బ్యాచ్ విద్యార్థులు 37 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలుసుకోవడం భావోద్వేగ క్షణంగా నిలిచింది.పాఠశాల రోజుల జ్ఞాపకాలు, గురువుల అనుభవాలు, పాత స్నేహాల మధుర క్షణాలు అందరినీ ఆనందపరిచాయి.పూర్వ విద్యార్థుల మధ్య పరస్పర సహకారం, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలపై చర్చలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.గురువులను సన్మానించడం ద్వారా విద్యకు గౌరవం తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఫోటో సెషన్లు, జ్ఞాపికల అందజేత కార్యక్రమానికి మరింత ప్రభావం చేకూర్చాయి.దుర్గా ప్రసాద్ ,సత్యం ,ఉపేందర్ సమన్వయం, పూర్వ విద్యార్థులను ఒక తాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు.ఈ కార్యక్రమంలో పద్మజ ,శారద ,నాగమణి , గీత ,విజయ చంద్రిక, కవిత ,నరసింహారెడ్డి ,బాబు వినయ్ పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియలో వేగం పెంచాలి

### క్షేత్ర స్థాయిలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



**విశ్వంభర, నాగోల్ :** నగరంలో నిర్వహిస్తున్న జనగణనలో వేగం పెంచాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నాగోల్ పరిధిలోని జైపురి కాలనీని సందర్శించి, కొనసాగుతున్న జనగణన గణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పురోగతి తక్కువగా ఉండటంపై సమీక్ష నిర్వహించారు. పనితీరు సరిగా లేని ఎన్యూమరేటర్లను వెంటనే మార్చి, జనగణన ప్రక్రియను వేగవంతంగా మార్చి సమర్థవంతంగా పూర్తి చేయాలని డీసీ ,ఏఎంసీ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లు , ఎన్యూమరేటర్లకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన హైడ్రేషన్ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు , తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. జనగణన ప్రక్రియను నిర్దేశిత గడువుల్లో నాణ్యతతో పూర్తి చేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (డీసీ), డీవైఈఈ (సెన్సస్ కోఆర్డినేటర్), ఏఎంసీ, టీఐలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## మజ్లీస్ పార్టీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : వి హెచ్ పి



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా భాగ్యనగర్ లో గో హత్యలు విపరీతంగా పెరుగుతున్నాయని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కారణమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముక్ బాలస్వామి ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఎంఐఎం ఆదేశాలకు తలొగ్గిందని విమర్శించారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నడిరోడ్డుపై వచ్చి పోలీసులపైనే దౌర్జన్యం చేస్తున్నప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత హేయమని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం బాలస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. స్వయంగా రైతు బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిజిపి సి వి ఆనంద్ గో రక్షణలో ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యాధునిక గోషాలలు నిర్మిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి..మరి గోవులను విపరీతంగా కోతకు తరలిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

## హఫీజ్‌పేట్‌లో భారీ మోసం.. బోర్డు తిప్పేసిన కన్సల్టెన్సీ

**విశ్వంభర, హైదరాబాద్ :** మియాపూర్ పీఎస్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హఫీజ్ పేట్‌లో సీడీ దశరథ్ కన్సల్టెన్సీ బోర్డు తిప్పేసింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను ముగ్గురు నిందితులు మోసం చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.6లక్షలు చొప్పున వసూలు చేశారు. నిందితులు అర్చన, సోమశేఖర్, రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారికోసం పోలీసులు గాలింపు చేపట్టారు. బాధితులు ఎంతమంది ఉన్నారనే అంశంపై విచారణ కొనసాగిస్తున్నారు.

# ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు.ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి-కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు.

**కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు..**

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# ఏఐతో సోషల్ మీడియాపై నిఘా..

### హైదరాబాద్ పోలీసుల చేతికి సరికొత్త అస్త్రం




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** సామాజిక మాధ్యమాల్లో విద్వేషాల్ని రెచ్చగొట్టేవారిపై ఉక్కుపాదం మోపేందుకు హైదరాబాద్ నగర పోలీసులు సరికొత్త అస్త్రంతో ముందుకొచ్చారు. సోషల్ మీడియా అబ్జర్వేషన్ అండ్ సైబర్ ఇంటెలిజెన్స్ పేరుతో సరికొత్త ఏఐ ఆధారిత అప్లికేషన్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఆన్‌లైన్‌లో తప్పుడు ప్రచారాలు చేసే వారిని పసిగట్టడం, అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు విశ్లేషించేలా ఈ అత్యాధునిక వ్యవస్థను హైదరాబాద్ పోలీస్ ఐటీ విభాగం రూపొందించింది. దీని గురించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో సోషల్ మీడియా పర్యవేక్షణకు భారీగా సిబ్బంది అవసరం అవ్వడమే కాకుండా గంటల తరబడి మాన్యువల్‌గా శ్రమించాల్సి వచ్చేది. ఈ 'సాక్ ఐ' ద్వారా ఇకపై అన్నీ ఆటోమేటెడ్ పద్ధతిలో నిరంతరాయంగా జరుగుతాయి. దీనిలోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ డ్యాష్‌బోర్డ్ ద్వారా డయల్ 100 కాల్స్, అంతర్గత నిఘా సమాచారం, నగరంలో జరుగుతున్న ప్రధాన ఘటనల వివరాలను ఒకే చోట క్రోడీకరించి అధికారులకు పూర్తి స్థాయి క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తుంది.

**ప్రయోగాత్మక దశలోనే అద్భుత పనితీరు..**

'సాక్ ఐ' ప్రయోగాత్మక దశలోనే అద్భుత పనితీరు కనబరిచింది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన పురానాపూల్ ఎక్స్ రోడ్ ఘటనకు సంబంధించి 85 విద్వేషపూరిత, మతపరమైన సున్నితమైన అంశాలను, అలాగే గుడిమల్కాపూర్ వివాదానికి సంబంధించి పలు సోషల్ మీడియా ఖాతాల్లో ఉన్న 126 పోస్ట్‌లను ఇది గుర్తించింది. ఇటువంటి కంటెంట్‌ను సకాలంలో తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టడం ద్వారా శాంతి సామరస్యాలను కాపాడటమే కాకుండా, విద్వేషాలను రేకెత్తించే వారిని గుర్తించడమూ సాధ్యమైంది. ప్రత్యేకించి మాదకద్రవ్యాల సరఫరా, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ వ్యవస్థ దృష్టి పెడుతుంది. చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్, సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్ వంటి అంశాలను ఏఐ మోడల్స్ స్వయంగా గుర్తించి అప్రమత్తం చేస్తాయి. పోస్టుల తీవ్రతను బట్టి వాటిని హై, మీడియం, లో రిస్క్ కేటగిరీలుగా విభజించి, అభ్యంతరకర పోస్టులను తొలగించేలా సంబంధిత సోషల్ మీడియా సంస్థలకు నివేదిస్తుంది.

**వైరల్ చేసే ఖాతాల్ని ఇట్టే పట్టేస్తుంది..**

నేరగాళ్ల నెట్‌వర్క్‌ని విశ్లేషించే సామర్థ్యం ఈ అప్లికేషన్ ప్రత్యేకత కావడంతో వివాదాస్పద పోస్టులను పదేపదే షేర్ చేసే వారిని, వాటిని వైరల్ చేసే ఖాతాలను ఇట్టే పట్టేస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులనూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ప్రతి ఫిర్యాదుకు ఒక యునిక్ ట్రాకింగ్ నంబర్ కేటాయించి, అది పరిష్కారమయ్యే వరకు ఎండ్‌టుఎండ్ మానిటరింగ్ చేస్తుంది. నగరంలో ప్రతిరోజూ జరిగే నిరసనలు, ర్యాలీలు, మతపరమైన ఊరేగింపుల వంటి కార్యక్రమాలపై ముందస్తు నిఘా ఉంచేందుకు 'ఈవెంట్ బేస్డ్ మానిటరింగ్' ఫీచర్‌ను ఇందులో పొందుపరిచారు. నిర్ణీత కీవర్డ్స్ ఆధారంగా సోషల్ మీడియా కార్యకలాపాలను ట్రాక్ చేస్తూ, ఏదైనా ముప్పు పొంచి ఉంటే వెంటనే పోలీసులను అప్రమత్తం చేస్తుంది.

**ఆ శక్తుల ఆటకట్టిస్తాం..: సజ్జనార్**

అత్యాధునిక ఏఐ సాంకేతికతతో కూడిన ఈ 'సాక్ ఐ' వ్యవస్థ పోలీసుల పనిభారాన్ని తగ్గించడమే కాకుండా, నేర నివారణలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు. 'సమాజంలో అశాంతిని ప్రేరేపించే శక్తుల ఆటకట్టించేందుకు, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ ఏఐ వ్యవస్థను రూపొందించాం. మారుతున్న కాలానికనుగుణంగా నేరగాళ్లు సామాజిక మాధ్యమాలను అస్త్రంగా చేసుకుంటున్న తరుణంలో, ఈ అత్యాధునిక సాంకేతికతతో వారిని సమర్థంగా ఎదుర్కొంటాం'' అన్నారు.

## అప్పు ఇచ్చిన 8 మందినీ చంపేందుకు ప్లాన్!

### మొయినాబాద్ జంట హత్యల కేసులో విస్తుగొలిపే విషయాలు

**విశ్వంభర, మొయినాబాద్ :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమకు అప్పు ఇచ్చిన 8 మందినీ చంపేందుకు కరీమా బేగం దంపతులు, మరో వ్యక్తి పథక రచన చేశారు. హత్యకు ప్లాన్ చేసిన 8 మంది మహిళల్లో ఇద్దరిని చంపగా.. మరో ఆరుగురిని కూడా అక్కడికి ఫాంహౌస్‌కు పిలిచారు. వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఇద్దరు మహిళల హత్య ఘటన వెలుగు చూసిన తర్వాత తమకూ ప్రాణహాని ఉందంటూ ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు.

**ఏం జరిగిందంటే..**

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆబేదాబేగం, మహబూబాబీ.. అదే కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. నిందితుల సమాచారంతో తాండూరు గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యాలాల ఎస్సై విఠల్‌రెడ్డి, బషీరాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ పోలీసు సిబ్బంది చేరుకొని తవ్వకాలు చేపట్టగా మహబూబాబీ అస్థిపంజరం బయటపడింది. తరువాత ఆబేదాబేగం మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం నిందితులను విచారించగా.. అప్పు ఇచ్చిన మరో ఆరుగురు మహిళలనూ చంపేందుకు ప్లాన్ చేసినట్లు షాకింగ్ విషయాన్ని వెల్లడించారు.

## ఓపెన్ ప్లాట్లకు వేలం.. తొర్రూర్‌లో చదరపు గజం రూ.45,500

**విశ్వంభర, హైదరాబాద్ :** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నిర్వహించిన బహిరంగ వేలానికి మంచి స్పందన వచ్చింది. ఫ్యూచర్ సిటీ, ఓఆర్ఆర్‌కి సమీపంలో రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లోని తొర్రూర్ (66), కుర్మల్‌గూడ (11) బహదూర్‌పల్లి (8) ప్రాంతాల్లోని మొత్తం 85 ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించారు. పెద్ద అంబర్‌పేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వేలంలో పాల్గొన్న బిడ్డర్లు.. చదరపు గజానికి నిర్దేశించిన దానికంటే అధిక మొత్తంతో కొనుగోలు చేయడం విశేషం. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు 83 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ వి.పి.గౌతం తెలిపారు. తొర్రూర్ లే అవుట్‌లో ప్లాట్‌ను కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీ పడ్డారు. గరిష్ఠంగా చదరపు గజం స్థలాన్ని రూ.45,500కు వేలం పాటలో కొనుగోలు చేసినట్లు స్వగృహ కార్పొరేషన్ ఎండీ తెలిపారు. ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న తొర్రూర్‌లో 200700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ.25వేలుగా నిర్ణయించగా.. సగటున రూ.32,500 ధర పలికిందని చెప్పారు.

## అంత్య పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**విశ్వంభర, హనుమకొండ :** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ రీజనల్ మేనేజర్ ఎస్.భవానీప్రసాద్ తెలిపారు. ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమ క్షేత్రమైన కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 3,360 బస్సులతో 5,772 ప్రత్యేక ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రీజియన్‌లోని హనుమకొండ, వరంగల్ 1, వరంగల్ 2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ డిపోల నుంచి కాళేశ్వరానికి 59 ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు. వీటితోపాటు ఉమ్మడి జిల్లాకు ప్రధానమైన హనుమకొండ బస్టాండు నుంచి మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో ఛార్జీల కంటే పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనంగా వసూలు చేస్తామన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు.

# శారీరక ఆరోగ్యానికి క్రీడలు అత్యంత అవసరం

- కమిషనర్ ఆఫ్ పోలీస్ రమేష్
- కార్పొరేట్ బ్యాడ్మింటన్ సమరం ముగింపు
- సీజన్-2 ఛాంపియన్‌గా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్



**విశ్వంభర, హైదరాబాద్ :** కార్పొరేట్ ప్రపంచంలో కేవలం వ్యాపార వ్యూహాలే కాదు, క్రీడల్లోనూ తమ సత్తా చాటగలమని ప్రముఖ ఐటీ మరియు కార్పొరేట్ సంస్థలు మరోసారి నిరూపించాయి. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా మూడు రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించిన "టీవీ9 నెట్‌వర్క్ కార్పొరేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - సీజన్ 2" ఘనంగా ముగిసింది. ఉత్కంఠభరితంగా సాగిన గ్రాండ్ ఫినాలేలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) జట్టు అద్భుత ప్రదర్శనతో అమెజాన్ జట్టుపై విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. చివరి వరకు హోరాహోరీగా పోరాడిన అమెజాన్ జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకోగా, ఇన్ఫోసిస్ జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుని ప్రశంసలు అందుకుంది. క్రీడాస్ఫూర్తి, టీమ్‌వర్క్, వ్యూహాత్మక ఆటతీరు ఈ ఛాంపియన్‌షిప్‌ను మరింత ప్రత్యేకంగా నిలిపాయి.

ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌ను మొదటి రోజున కమిషనర్ ఆఫ్ పోలీస్ రమేష్ IPS, పద్మశ్రీ అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్, టీవీ9 నెట్‌వర్క్ సిఓఓ విక్రమ్, సిఆర్‌ఓ అమిత్ త్రిపాఠి, జనరలి లైఫ్ ఇన్సూరెన్స్ వైస్ ప్రెసిడెంట్ & సౌత్ ఇండియా హెడ్ వికాస్ సంయుక్తంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ రమేష్ మాట్లాడుతూ.. నేటి కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగులు, పిల్లలు మొబైల్ ఫోన్లు, బిజీ జీవనశైలికి పరిమితమవుతున్నారని, మానసిక వికాసం, శారీరక ఆరోగ్యానికి క్రీడలు అత్యంత అవసరమని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటే చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని సూచించారు.

ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ, కార్పొరేట్ ఉద్యోగులపై పని ఒత్తిడి రోజురోజుకు పెరుగుతోందని, అలాంటి పరిస్థితుల్లో ఫిజికల్ యాక్టివిటీస్ మరియు క్రీడలు ఎంతో అవసరమన్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, వాటిని నివారించాలంటే ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ ఛాంపియన్‌షిప్‌లో మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఇన్ఫోసిస్, గూగుల్, టీసీఎస్, డెల్, యాక్సెంచర్, ఎల్&టి, పెగాసిస్టమ్స్ ఇండియా, డెలాయిట్, ఒరాకిల్, మైహోమ్ గ్రూప్, ష్రోడింగర్ ఇండియా, పీడబ్ల్యూసీ, జేపీ మోర్గాన్ చేజ్, హెచ్‌సీఎల్ టెక్, ఉబెర్, ఎంఫసిస్, మహా సిమెంట్, కట్‌ఫిట్, టైమ్స్ ఆఫ్ ఇండియా తదితర అగ్రశ్రేణి సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విభాగాల్లో కూడా పలువురు క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మెన్స్ సింగిల్స్ విజేతగా గ్లాన్స్‌కు చెందిన ప్రజ్వల్ నిలవగా, ఉమెన్స్ సింగిల్స్‌లో ఎన్ రంగారావు అండ్ సన్స్‌కు చెందిన చిన్మయి విజేతగా నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ర్యాన్ సంస్థకు చెందిన రాహుల్ - భార్గవి జోడీ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS | ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108